www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5

ఏలూరు

షేక్ రిబ్కాకు గిన్నిస్ బుక్‌లో స్థానం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన షేక్ మదర్ సాహెబ్-హుస్సేన్ బి దంపతుల కుమార్తె షేక్ రిబ్కాకు గిన్నిస్ బుక్‌లో స్థానం లభించింది. 2024 డిసెంబర్‌లో 18 దేశాలకు చెందిన 1046 మంది విద్యార్థుల ఆన్‌లైన్ సంగీత ప్రదర్శనలో ఉత్తమ కీబోర్డ్ ప్రదర్శనకు గాను షేక్ రిబ్కాకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. విజయవాడ మెట్రోపాలిటన్ చర్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో చిన్నారికి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు ప్రశంసించారు.

మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న షేక్‌రిబ్కా

కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థమే

మూడో కాంటూరుకు కుదిస్తేనే న్యాయం

ఉపాధి, అభివృద్ధి లేక నరకయాతన అనుభవిస్తున్నాం

కాంటూరులో లేని భూములను సైతం ధ్వంసం చేసి రోడ్డున పడేశారు

అండగా ఉండాలంటూ సిపిఎం బృందానికి కొల్లేరు ప్రజల వినతి

ఎప్పటికీ కొల్లేరు ప్రజల వైపే నిబడతామని సిపిఎం నేతల భరోసా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, మండవల్లి, ఏలూరు సిటీ

కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థంగా నిర్ణయించారని, అధికారులు చేసిన తప్పిదాలకు తాము బలిపశువులుగా మారామని, ఉపాధి, అభివృద్ధి లేక నరకయాతన అనుభవిస్తున్నామని కొల్లేరు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా నేతల ఆధ్వర్యంలో సిపిఎం బృందం శనివారం కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా గుడివాకలంక, కొవ్వాడలంక గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లోనూ, పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు ప్రజలు, నాయకులు తమ సమస్యలను సిపిఎం బృందానికి వివరించారు. తొలుత ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక గ్రామానికి సిపిఎం బృందం చేరుకోగానే పంచాయతీ సర్పంచి ఘంటసాల నాగరాజు, కొల్లేరు పెద్దలు స్వాగతం పలికారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సర్పంచి నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా జిల్లా కార్యదర్శి ఎ.రవి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులను గ్రామస్తులకు పరిచయం చేశారు. సర్పంచి నాగరాజు, గ్రామస్తులు తాతిపూడి చందు, దొరబాబు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తేనే ఇక్కడి ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి కొల్లేరు ప్రజల సమస్యలను సిపిఎం నాయకులకు వివరించారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉండాలని కోరారు. కొల్లేరు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు రావడం ఎంతో ధైర్యంగా ఉందన్నారు. అనంతరం సిపిఎం బృందం, గ్రామస్తులతో కలిసి గుడివాకలంక గ్రామంలో నిర్మించిన రిసార్ట్‌ను పరిశీలించింది. అక్కడి నుంచి మాధవాపురంలో ఏర్పాటు చేసిన పక్షుల కేంద్రం వద్దకు వెళ్లి కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పెదఎడ్లగాడి వంతెన వద్ద ఆగి కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కలకుర్రుకు చెందిన కొల్లేరు నాయకులు ఘంటసాల పెద్దిరాజు, ప్రత్తికోశలంకకు చెందిన మహాలక్ష్మిరాజు సిపిఎం నాయకులను కలిసి కొల్లేరు గ్రామాల్లో పరిస్థితిని మ్యాప్‌లు, కొల్లేరు గ్రామాల్లో కాంటూరుతో సంబంధం లేకుండా ఎక్కడెక్కడ భూములను ధ్వంసం చేశారో వివరించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థంగా ఉన్నాయన్నారు. కాంటూరులో లేని భూములను సైతం ధ్వంసం చేసి ఇక్కడి ప్రజలను రోడ్డున పడేశారన్నారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసి వాస్తవాలను వెల్లడించాలన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామన్నారు. అనంతరం మండవల్లి మండలంలోని కొవ్వాడలంక గ్రామంలో సిపిఎం బృందం పర్యటించింది. గ్రామ సర్పంచి జయమంగళ తిరుపతి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు వి.శ్రీనివాసరావు, బి.బలరాం మాట్లాడుతూ 2006, అంతకు ముందు కొల్లేరు ప్రజలకు అండగా సిపిఎం పోరాటం సాగించిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ కొల్లేరు ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కలిసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. సిపిఎం బృందంలో నాయకులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పిల్లి రామకృష్ణ, లెనిన్, ఇస్సాక్, కట్టా భాస్కరరావు, మానుకొండ వీర్రాజు, ఇతర నాయకులు ఉన్నారు.

గుడివాకలంకలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కొల్లేరును పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర, జిల్లా నేతలు

మూడు లక్షల మందిని మనుషులుగా గుర్తించండి

ఘంటశాల వెంకటలక్ష్మి, జనసేన దెందులూరు నియోజకవర్గ నేత

కొల్లేరు గ్రామాల్లో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారు. మమ్మల్ని మనుషులుగా గుర్తించాలని కోరుతున్నాం. పర్యావరణం, పక్షులతోపాటు మమ్మల్నీ గుర్తించాలి. సిపిఎం బృందం వద్దకు వెళ్లాలని తామే అనుకుంటుంటే, వారే ఇక్కడకు రావడం చాలా ధైర్యాన్ని ఇచ్చింది. ఇక్కడి సమస్యలను సుప్రీంకోర్టు కమిటీకి మీరే తెలపాలి. మా బాధలు తెలుసుకుని అండగా ఉండాలని సిపిఎం నేతలను కోరుతున్నాం.

కొల్లేరు ప్రజల జీవితాల్ని నాశనం చేశారు

చందు, గుడివాకలంక గ్రామస్తుడు

2006లో చెరువులన్నీ కొట్టేశారు. మెరుగైన జీవనోపాధి ఇస్తామని చెప్పి ఉన్న జీవితాలను నాశనం చేశారు. ఇక్కడి ప్రజలకు చేపల వేటనే ఉపాధి. కొల్లేరు ప్రజలు డబ్బుతో ఉన్నారంటూ అనుకుంటారు. ఇక్కడికి వచ్చి చూస్తే మా పరిస్థితి తెలుస్తుంది. రోడ్లు సైతం వేయకుండా వదిలేశారు. పర్యావరణంతోపాటు కొల్లేరు ప్రజల జీవితాలను కాపాడాలని కోరుతున్నాం. సిపిఎం లాగేనే అందరూ కొల్లేరు ప్రజలకు అండగా ఉండాలనేది మా ఆకాంక్ష.

అధికారుల తప్పిదాలకు మేం బలి పశువులుగా మారాం

ఘంటశాల మహాలక్ష్మిరాజు, కొల్లేరు నాయకుడు

అధికారులు కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థంగా తయారు చేయడంతో మేం బలి పశువులుగా మారాం. కైకలూరు, మండవల్లి గ్రామాల్లో 7,600 ఎకరాల జిరాయతీ భూములను ధ్వంసం చేశారు. 120 జిఒకు సంబంధం లేకుండా ఇది జరిగింది. కొవ్వాడంలంక గ్రామం పూర్తిగా దెబ్బతింది. మ్యాప్‌లు, నివేదికలకు సంబంధం లేకుండా కాంటూరు లెక్కలను నిర్దేశించి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. సమస్యలను ఢిల్లీ వరకూ తీసుకెళ్ళి కొల్లేరు ప్రజలకు సిపిఎం అండగా ఉండాలని కోరుతున్నాం.

మా పిల్లల భవిష్యత్తును కాపాడండి

దొరబాబు, గుడివాకలంక గ్రామస్తుడు

కొల్లేరు ప్రజలు ఇప్పటికీ కూలికి వెళ్తేనే రోజు గడిచే పరిస్థితి ఉంది. మా బతుకులు బుగ్గిపాలయ్యాయి. మా పిల్లల భవిష్యత్తునైనా కాపాడాలి. సిపిఎం నాయకులు వచ్చి భరోసా ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

మూడో కాంటూరుకు కుదించాలన్నా పట్టించుకోవడం లేదు

ఘంటశాల నాగరాజు, సర్పంచి, గుడివాకలంక

ఎన్ని ప్రభుత్వాలు మారినా కొల్లేరును మూడో కాంటూరుకు కుదించడంపై పట్టించుకోవడం లేదు. పర్యావరణానికి మేము ఆటంకం కాదు.. మాకు శాశ్వత పరిష్కారం చూపాలి. 2006లోనూ సిపిఎం కొల్లేరు ప్రజలకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

గ్రామంలో సెంటుభూమి లేకుండా చేశారు

జయమంగళ తిరుపతి వెంకన్న, సర్పంచి, కొవ్వాడలంక

ఐదో కాంటూరు పైన ఉన్న భూములను కొట్టేశారు. గ్రామంలో సెంటుభూమి లేకుండాపోయింది. కూలినాలికి వెళ్లి బతుకుతున్నాం. గ్రామంలో ఏ ఆధారమూ లేకుండాపోయింది. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు రూ.2.25 కోట్లు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

కౌలు రైతులకూ పరికరాలు ఇవ్వాలి

కౌలురైతుసంఘం నేత కొర్ని అప్పారావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అధునాతన పరికరాలతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించేందుకు జిల్లాకు రూ.2.25 కోట్లు నిధులొచ్చాయని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు మండలాల రైతులకు రాయితీపై మంజూరైన పరికరాలను శనివారం పంపిణీ చేశారు. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు నూతన క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి వెట్రిసెల్వి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ఎంఎల్ఎ ధర్మరాజు కోరిక మేరకు రూ.30 కోట్లు ఇచ్చామని, వాటిని సద్వినియోగ చేశారని అన్నారు. రైతుల సహకారంతో అధిక పంట దిగుబడులు సాధించి జిల్లాను దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా మాట్లాడుతూ ధాన్యం సేకరణలో లక్ష్యాన్ని దాటామని, అదనంగా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు వచ్చాయని తెలిపారు. కౌలురైతు సంఘం నాయకుడు కొర్ని అప్పారావు మాట్లాడుతూ పరికరాలను భూయజమానులతోపాటు కౌలురైతులకు ఇస్తేనే ఉపయోగకరమన్నారు. నిడమర్రుకు చెందిన ఓ రైతు మాట్లాడుతూ పంట, మురుగు బోదెలు ఆక్రమణలతో పూడుకుపోయాయన్నారు. రాయితీపై ధాన్యం ఆరబోసే డ్రయ్యర్ ఇవ్వాలని రైతులు కోరారు. ధాన్యం ఆరపెట్టేందుకు సామూహిక కళ్లాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని మరోరైతు చెప్పారు. అనంతరం ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఉంగుటూరు, నారాయణపుం సర్పంచులు బండారు సింధు, దిడ్ల అలకనంద, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, బిజెపి నేత శరణాల మాలతీరాణి, వైస్ ఎంపిపి సింగిరెడ్డి సూర్యనారాయణ, నేత నాయకులు సూరత్తుల అయ్యప్ప, భీమడోలు ఎడిఎ ఉషారాజకుమారి, వ్యవసాయాధికారులు, తహశీల్దారు పాలపర్తి రవికుమార్, ఎంపిడిఒ రాజ్‌మనోజ్ పాల్గొన్నారు.



పవర్ ట్రిల్లర్‌ను స్టార్ట్ చేస్తున్న కలెక్టర్

ఎండలోనే నిలబడిన రైతులు

ఉదయం 9.30 గంటలకే సమావేశానికి చేరుకున్న రైతులు, పలువురు కూటమి నాయకులు కుర్చీలు లేక ఎండలోనే గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. అసలే ఎండాకాలం.. సరిపడా టెంట్లు, కుర్చీలు వేయడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు రైతులు విమర్శించారు.

చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన కలెక్టర్

చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి శనివారం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఫెన్సింగ్ వేయించాలని అధికారులను ఆదేశించారు.

రఘురామ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో ఇళ్ల కూల్చివేత బాధితులను పరామర్శించి, వారికి న్యాయం చేయాలని కోరిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానికంగా శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు తక్షణం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అండగా ఉంటానని ఎన్నికల్లో హామీలిచ్చి నేతలు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకపోగా ప్రజల పక్షాన నిలబడిన సిపిఎం నాయకులను దుర్భాషలాడటం దారుణమన్నారు. కార్యక్రమంలో నేతలు తెల్లం దుర్గారావు, జి.సూర్యకిరణ్, కె.సుబ్బారావు, బి.నాని, నల్లంటి భద్రయ్య, కె.సత్యనారాయణ, డి.ఆశీర్వాదం పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: సిపిఎం ఆధ్వర్యాన స్థానిక జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేత సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉండి రఘురామకృష్ణరాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు కారెం నాగదుర్గ, సిహెచ్.కొండలరావు, సుంకవల్లి శేషగిరిరావు, రమణ, వెంకటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

చెరువులో ధాన్యం లోడు లారీ బోల్తా

నీటిలో మునిగిన ధాన్యం బస్తాలు

ట్రక్ జనరేట్ వల్ల రైతులకు ఇబ్బంది లేదు : తహశీల్దార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాకర్లమూడిలో ధాన్యం లారీ చెరువులో బోల్తా పడింది. ధాన్యం బస్తాలు నీటిలో మునిగిపోయాయి. కాకర్లమూడి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రానికి 500 బస్తాలు తోలారు. ట్రక్ షీట్ జనరేట్ అయింది. వల్లూరులోని సత్యకృష్ణా ఎంఆర్ అండ్ బ్రాయిలర్ మిల్లులకు ధాన్యం తోలాల్సి ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి లారీలో నారిన వెంకటేశ్వరరావుకు చెందిన 117 బస్తాలు, చనిబోయిన ఏసుబాబు వంద, రాజాని నాగదుర్గకు చెందిన 229 మొత్తం 500 బస్తాలు లోడ్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు 12 గంటలు దాటాక బయలుదేరిన లారీ స్థానిక ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న పశువుల చెరువులో లారీ బోల్తా పడింది. ఇటీవల కాకర్లమూడిలో తారురోడ్డును నిర్మించగా ఇటీవలే ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ క్రమంలో తారురోడ్డు అంచువెంబడి కంకర వేశారు. చీకట్లో కనిపించక కంకర వేసిన మార్జిన్‌లో లూజు మట్టి వల్ల లారీ వెనుక చెక్రాలు మట్టిలో దిగబడి చెరువులోకి బోల్తా కొట్టింది. ఆ సమయంలో లారీ డ్రైవర్ సత్యనారాయణ ప్రాణభయంతో బయటకు దూకేయడంతో క్షేమంగా బయటపడ్డారు. ధాన్యం బస్తాలన్ని చెరువు నీటిలో మునిగిపోయాయి. ట్రక్ షీట్ జనరేట్ కారణంగా ధాన్యం సంబంధిత మిల్లు ఆధీనంలో ఉన్నట్టేనని, రైతులకు ఎలాంటి సమస్య లేదని, ధాన్యం తోలిన వాటికి కచ్చితంగా డబ్బులు వస్తాయని తహశీల్దార్ పాలపర్తి రవికుమార్ తెలిపారు. ధాన్యం విలువ సుమారు రూ.ఐదు లక్షలు ఉంటుందని తెలిపారు.

చెరువులో బోల్తా పడిన లారీ

మహిళలకు రక్షణగా శక్తి యాప్

అదనపు ఎస్పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆపదలో ఉన్న మహిళలను, విద్యార్థినులను, బాలికలను కాపాడేందుకు ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించిందని, దానిని వినియోగించుకుని ఆపద సమయాల్లో ప్రతిఒక్కరూ పోలీసుల సహాయాన్ని పొందవచ్చని అదనపు ఎస్పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని ఒక ప్రయివేట్ పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌లో శనివారం ఆయన శక్తి టీమ్‌తో కలిసి అభ్యర్థులకు మహిళ భద్రతపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా 112కు ఫోన్ చేయడం ద్వారా మహిళలకు, పురుషులకు కూడా ఆపదలో ఉంటే వారికి సహాయం అందుతుందని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇచ్చి వారు పోగొట్టుకున్న సొమ్ము తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. మహిళాలందరూ తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారంతా విజయం సాధించి ప్రభుత్వ కొలువుల్లో చేరి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. తెలిసిన వారికి కూడా ఈ యాప్‌పై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అంతర్జాలంలో అపరిచిత వ్యక్తులతో పరిచయం పెంచుకోవడం ద్వారా సైబర్ నేరానికి గురవుతారన్నారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహించాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు, పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి శ్రీ అన్నేరామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆరో తరగతిలో చేర్చుకునేందుకు మెర్సపూడి గ్రామంలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుని పి.రాధికారాణి తెలిపారు. నలుగురు విద్యార్థులకు ఎడ్మిడ్ కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జల్లు లక్ష్మి, కోటేశ్వరమ్మ, విజయలక్ష్మి, ఫిజికల్ డైరక్టర్ రవీంద్ర, నాన్ టీచింగ్ సిబ్బంది నారాయణ పాల్గొన్నారు.

పీజీ సెంటర్‌కు కొత్త హంగులు

కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంజీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు పీజీ సెంటర్‌కు రానున్న విద్యా సంవత్సరానికి కొత్త హంగుల సమకూర్చనున్నట్లు కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంజీ తెలిపారు. డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో సోలార్ హైబ్రిడ్ మోడ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అకడమిక్ న్యూ బ్లాక్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుండి అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో సరికొత్త సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండి ఎంసిఎ కోర్సు ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల అభీష్టం మేరకు ఫార్మసీ కోర్సును కూడా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అవసరం మేరకు గెస్ట్ ఫ్యాకల్టీలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు పీజీ సెంటర్ ప్రధాన గేటు నిర్మాణానికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంజీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నవీన లావణ్య లత, ఎస్ఎస్ఎస్ యూనిట్ అధికారి ఎస్‌కె.అన్వర్ భాష, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, ఇంజినీరింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న విసి ప్రొఫెసర్ రాంజీ

అభివృద్ధి అంటే..!

ఎన్నికల ముందు ప్రచారంలో ప్రతిపక్ష, అధికారపక్షాలు ఈ పదాన్ని ఎక్కువ ఉపయోగిస్తుంటాయి. ఎన్నికల తర్వాత ఆ స్థాయిలో కాకపోయినా నేతల నోట పదేపదే విన్పించే మాట ఇదే. అయితే తాము చేసిన పనులే అభివృద్ధి పనులుగా పాలకులు చెప్పుకుంటే.. ప్రజల సమస్యలను ప్రస్తావించి వాటి సంగతేమిటని నిలదీయడం ప్రతిపక్షాల వంతు. 'పది మంది దోషులు బయటున్నా పర్వాలేదుగాని.. ఒక నిర్దోషి నిర్బంధంలో ఉండకూడదు' అనేది సహజ న్యాయ సూత్రం. అలాగే అభివృద్ధి అనేది ఏఒక్క పేదవానికీ నష్టం కల్గించకుండా ఉండాలనేది జనం, జనం పక్షాన నిలిచేవారి ఆకాంక్ష.

ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి అనే అంశంపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఇది ఉండి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉందనేది అందరికీ తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కాల్వల అభివృద్ధికి విరాళాల సేకరణ చేపట్టిన ఘనత ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజుకే దక్కింది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ప్రభుత్వం చేపట్టాల్సిన పనులు ఎంఎల్ఎ తన భుజస్కంధాలపై వేసుకుని విరాళాలు సేకరించి పనులు చేపడుతున్నారని అంతా భావించారు. తర్వాత నియోజకవర్గ పరిధిలోని పోలీసు స్టేషన్లు అన్నింటికీ వాహనాలు సమకూర్చడం, సీసీ కెమెరాలు సమకూర్చడం వంటివన్నీ దాతల ద్వారా ఎంఎల్ఎ చేపట్టారు. వీటిలో ఎక్కడా పేద, మధ్యతరగతి ప్రజలకు దాతల నుంచి సేకరించిన సొమ్ము అందించింది లేదు. అంటే చంద్రబాబు చెబుతున్న పి4 ప్రకారం పెద్దల ద్వారా పేదల అభివృద్ధి పక్కనబెట్టి, పెద్దల నుంచి ప్రభుత్వ శాఖలకు కనీస వసతుల కల్పనపైనే సాగడం అనేది ఉండి నియోజకవర్గ పి4 ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఇక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివశిస్తున్న పేదల ఇళ్లను కాలుష్య నివారణ, కాల్వల అభివృద్ధి పేరిట వందల సంఖ్యలో ఉండి నియోజకవర్గంలో తొలగించారు. ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు ఇలా అన్ని మండలాల్లోనూ ఇది సాగింది. దీనిపై ఆయా సందర్భాల్లో పెద్దఎత్తున పేదలు ఆందోళన చేశారు. దీనిలో భాగంగానే పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో సుమారు 35 ఏళ్ల నుంచి నివాసముంటున్న వారిని గత శనివారం ఖాళీ చేయించే ప్రయత్నం చేయగా పేదలు పెద్దఎత్తున ప్రతిఘటించారు. ఈ క్రమంలో పోలీసుల దాడిలో పలువురు గాయాల పాలయ్యారు. దీంతో వెనక్కితగ్గిన యంత్రాంగం, మరుసటి రోజు తెల్లవారుజామునే ముందుగానే నేతలను గృహనిర్బంధం చేసి ఆ ప్రాంతంలో పెద్దసంఖ్యలో పోలీసులను మొహరించి నిర్వాసిత్యంగా ఇళ్లను కూల్చేశారు. దీనిపై బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పేందుకు సిపిఎం రాష్ట్ర బృందం అక్కడ పర్యటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల ఇళ్ల కూల్చడం అభివృద్ధి కాదని, నెల రోజుల్లో అక్కడే బాధిత పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని బహిరంగంగానే ప్రకటించారు. పేదలకు న్యాయం చేయాలనేది ఆయన ప్రధాన డిమాండ్. దీనిపై డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు స్పందించిన తీరు రాజకీయ నేతలను, ప్రజలను నిర్ఘాంత పర్చింది. ప్రధానంగా వాడిన భాష, తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. పోనీ ఆయన భాష, తీరు సంగతి పక్కన పెడితే సిపిఎం నేతల ప్రధాన డిమాండ్ పేదలకు న్యాయం చేయాలనేది. దానిపై ఎక్కడా నేరుగా ఎంఎల్ఎ స్పందించిన పరిస్థితి లేదు. ప్రధానంగా ఎక్కడైతే ఇళ్లు కూల్చారో వారందరికీ ఇళ్లు అక్కడే నిర్మిస్తామనో, లేక వేరేచోట స్థలాలు కేటాయించి నిర్మిస్తామని చెబితే అర్థం ఉంది. పేదల నివాస ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న బోదె దిగువ ప్రాంతం వారు కాలుష్యం వల్ల ఇబ్బంది పడుతున్నందు వల్లే ఈ చర్యలని రఘురామకృష్ణరాజు చెప్పారు. కచ్చితంగా కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాల్సిందే. అసలు కాలుష్యం సమస్యపై జిల్లాలో పోరు సాగించింది ఎవరంటే సిపిఎం అనేది అందరికీ తెలుసు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ భీమవరంలో సమావేశం నిర్వహించి సుమారు 19 పరిశ్రమల వల్ల డెల్టాలో కాలుష్యం సమస్య తీవ్రంగా ఉందని సైతం ప్రకటించారు. ఇది సిపిఎం పోరుబాట ఫలితమేనని టిడిపి నేతలకు సైతం తెలుసు. ఇక ఎఎస్ఆర్ నగర్‌వాసుల వల్ల కాలుష్యం సమస్య 35 సంవత్సరాలుగా లేనిది ఇప్పుడే వచ్చిందా. ఒకవేళ వస్తే ఈలోపు అక్కడి ప్రజలను హెచ్చరించి, దిగువ ప్రాంత ప్రజలకు ఇబ్బంది రాకుండా తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టొచ్చు. అక్కడ నివశిస్తున్న అర్హులైన పేదలకు ప్రత్యామ

డెక్క తొలగించిన అనంతరం కాలువ

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి – ముదినేపల్లి

ముదినేపల్లి సెక్షన్ జల వనరుల శాఖాధికారులు స్పందించి శనివారం గుర్రపు డెక్కను తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డంకిగా డెక్క అనే శీర్షికతో శనివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముదినేపల్లి వద్ద పోలరాజ్ కెనాల్ కాలిబాట వంతెన కానాలకు డెక్క దట్టంగా పట్టివేసి నీరు దిగువ పారుదలకు అడ్డంకిగా మారింది. దీంతో కాలువ శివారు గ్రామాలకు తాగునీరు సక్రమంగా పారే పరిస్థితి లేదు.ఈ సమస్యపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వంతెన కానాల వద్ద దట్టంగా పేరుకుపోయిన డెక్కను తొలగించారు. దీంతో కాలువ ద్వారా దిగునకు నీరు సక్రమంగా ప్రవహిస్తుంది.

తాగునీటి ట్యాంకర్ల అందజేత అభినందనీయం

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి – భీమడోలు

తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన ట్యాంకర్ల అందజేతకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని కురెళ్ల గూడెం గ్రామంలో టిడిపి నాయకులు, టెలికం సలహా సంఘం కమిటీ, జిల్లా డైరెక్టర్ ఉండవల్లి బాలనందం తల్లి కమలావతి పేరున శనివారం నిర్వహించిన ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయనతో పాటు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. అనంతరం బాలనందం స్థానికంగా తాగునీటి ఎద్దడి సమయంలో సమస్య పరిష్కారానికి నీరు సరఫరా చేసేందుకు అవసరమైన ట్యాంకరును తన తల్లిదండ్రులు భూచక్రధరరావు, కమలావతి పేర్లన అందించారు. ట్యాంకర్‌ను ఉంగుటూరు ఎంఎల్ఎతో పాటు గన్ని వీరాంజనేయులు స్వీకరించి నిర్వాహకులకు అందించారు. ట్యాంకర్‌ను సమకూర్చిన దాత ఉండవల్లి బాలనందంను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకు ప్రారంభిస్తున్న ధర్మరాజు

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ ఆరో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. గ్రంథాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కథలు చెప్పడం, కథలు చదివించడం, పుస్తక పఠనం, చదవడం మాకిష్టం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, క్యారమ్స్, క్విజ్, జనరల్ నాలెడ్జ్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులను ఉత్సాహపరిచేందుకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. ఇందుకోసం ఔత్సాహికులైన ఆయా విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పంపాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణ కోసం దాతృత్వం కలిగిన వ్యక్తులు వారి వారి పెద్దల పేరిట, సంస్థల పేరిట విద్యార్థులకు బహుమతులు అందించవచ్చని తెలిపారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ

ప్రజాశక్తి – మండవల్లి

హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించుకోవచ్చని ఎస్ఐ రామచంద్రరావు చెప్పారు. జిల్లా అధికారుల ప్రత్యేక డ్రైవ్‌పై ఇచ్చిన ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో తలలకు తీవ్ర గాయాలై వాహనదారులు మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను విధిగా ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం హెల్మెట్లు, వాహన పత్రాలు, లైసెన్స్ లేని 15 మందిపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగిరిపల్లి : వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ అన్నారు. ఆగిరిపల్లి-వడ్లమాను మెయిన్‌రోడ్డు వద్ద శనివారం సాయంత్రం ఆయన విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహనదారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, సైబర్‌నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి పెయింటర్ మృతి చెందాడు. ఈ ఘటన నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... పోతునూరు ప్రాంతానికి చెందిన లింగాల పరశురాం (31) పెయింటర్‌గా పనిచేస్తూ భార్య పిల్లలతో కలిసి జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నగరంలోని వంగాయగూడెం సమీపంలోని సుబ్రహ్మణ్య కాలనీలో ముత్తయ్య అనే బ్యాంకు ఉద్యోగి ఇంటికి శనివారం పెయింటింగ్ పనుల నిమిత్తం వెళ్లాడు. ఒకటో ఫ్లోర్‌లో పెయింటింగ్ పనులు చేస్తుండగా భవనానికి అతి సమీపంలో ఉన్న హై టెన్షన్ విద్యుత్ వైర్లు అతనికి తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలి పనికి వెళ్లి...

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

గుర్రపు డెక్క తొలగించేందుకు చెరువులో దిగిన కూలీ ఫిట్స్ రావడంతో మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నగరంలోని తూర్పు వీధి ప్రాంతానికి చెందిన టి.జీవరత్నం (26) స్థానికంగా కూలి పనులు చేస్తుంటాడు. తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఏలూరు జంగారెడ్డిగూడెం రోడ్డులో రూరల్ పరిధిలో ఉన్న రామన్నకోనేరు చెరువులో గుర్రపు డెక్క తీసేందుకు మరో ముగ్గురు కూలీలతో కలిసి చెరువులో దిగాడు. కొద్దిసేపటికి అతనికి ఫిట్స్ రావడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. తోటి కూలీలు గంట తర్వాత అతన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి నాగేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు బైండోవర్

ప్రజాశక్తి – ముసునూరు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ నూజివీడు స్టేషన్ పరిధిలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పాత కేసుల్లో ఆరుగురు నిందితులను డిప్యూటీ తహశీల్దార్ రమణ ఎదుట హాజరు పరచి వారిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ ఈ బైండోవర్ ఒక సంవత్సరం ఉంటుందని, ఈ కాల పరిమితిలో మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానాతో పాటు ప్రభుత్వ పథకాలు రద్దు చేయనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

తాగునీరందించండి మహాప్రభో..!

వైఎస్ఆర్ కాలనీవాసుల ఆవేదన
పక్క గ్రామానికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిందే
డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
అధికారులు స్పందించాలని వేడుకలు

ప్రజాశక్తి – చింతలపూడి

నగర పంచాయతీలోని వైఎస్ఆర్ కాలనీ వాసులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. కాలనీలో తాగునీరు కూడా లేని పరిస్థితి నెలకొంది. సుప్రీంపేట వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి అని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులకు, నాయకులకు పలుమార్లు మొర పెట్టుకున్నా స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2007లో వైఎస్ఆర్ కాలనీ ఏర్పడినా నేటికీ తాగునీటి కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. లేదా డబ్బులు ఇచ్చి మినరల్ వాటర్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

చింతలపూడి నగర పంచాయతీలోని వైఎస్ఆర్ కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో తాగునీటి సమస్యతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కాలనీలో వస్తున్న నీరు తాగేందుకు పనిచేయడంలేదని ప్రజలు వాపోతున్నారు. నీరు ఉప్పగా ఉండడంతో ఉంటుందని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కన ఉన్న గ్రామం నుంచి పైపులైన్ కనెక్షన్ అడిగితే తమకు ఇబ్బందిగా ఉంటుందని, అక్కడకు ఇవ్వడం కుదరదని అక్కడి ప్రజలు చెప్పటంతో సమస్య అలాగే ఉంది. వైఎస్ఆర్ కాలనీ ప్రజలకు తాగునీరు ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అని, సమస్యను పరిష్కరించాలని సిపిఎం నేతలు కోరారు.

ఇంకా పూర్తికాని ప్రభుత్వ కాలనీలు

మండలంలోని నాగిరెడ్డిగూడెం వద్ద 2022లో మొదలు పెట్టిన ప్రభుత్వ కాలనీ నేటికీ పూర్తి కాలేదు. మొత్తం 430 ఇళ్ల మంజూరు కాగా 300 పూర్తయ్యే దశలో ఉన్నాయి. రూ.35 వేల నగదు ఇచ్చిన లబ్ధిదారుల గృహాలు మాత్రమే మొదలుపెట్టారు. 270 ఇళ్లకు ప్లాస్టింగ్ వరకే పూర్తి చేసి తలుపులు, రంగులు వేయని పరిస్థితి. 160 ఇళ్ల వరకు ఇంకా మొదలు పెట్టలేదు. 30 గృహాల లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అదే విధంగా సమ్మెటివారిగూడెంలో 160 మంజూరు కాగా 43 నిర్మాణ దశలో ఉన్నాయి. 2022లో మొదలుపెట్టిన ప్రభుత్వ కాలనీ నేటికీ పూర్తి కాకపోవటంతో లబ్ధిదారులు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడకు చెందిన కాంట్రాక్టర్ రూ.35 వేలు కట్టించుకుని పట్టించుకోకుండా వెళ్లిపోయినట్లు సరస్వతి అనే లబ్ధిదారురాలు సిపిఎం నేతలకు తమ గోడును చెప్పుకుంది. ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారని, పేద ప్రజల సొంత ఇంటి కల కూటమి ప్రభుత్వంలోనైనా తీరుతుందా లేదా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

రేవంత్, హౌసింగ్ ఎఇ

నాగిరెడ్డిగూడెం, సమ్మెటివారిగూడెంలో ఉన్న కాలనీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. త్వరగా పూర్తి చేస్తామని చెప్పి రూ.35 వేలు తీసుకుని వెళ్లినట్లు తమ దృష్టికి రాలేదు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

యువతకు క్రికెట్ కిట్టు అందజేత

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గత వారం రోజుల క్రితం నూజివీడు 25 వార్డులో పర్యటించగా స్థానిక రెల్లి యువత క్రికెట్ నైపుణ్య అభివృద్ధికి క్రికెట్ కిట్టు అవసరమని మంత్రిని కోరారు. సుమారు రూ.20 వేల ఖరీదైన క్రికెట్ కిట్టు మంత్రి వ్యక్తిగత సిబ్బందితో రెల్లి యువతకు మంత్రి క్యాంపు కార్యాలయంలో అందించారు. 25 వార్డు రెల్లి యువత హర్షం వ్యక్తం చేసి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వేగ నిరోధకాల ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి – భీమడోలు

ప్రమాదకరమైన రోడ్డు మలుపుల వద్ద వాహనాల వేగ నియంత్రణ స్థావర్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన దాతలు అభినందనీయులని భీమడోలు సిఐ విల్సన్ తెలిపారు. భీమడోలు– ద్వారకాతిరుమల రాష్ట్రీయ రహదారిపై పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆంజనేయ నగరం వద్ద ప్రమాదకరమైన రోడ్డు మలుపు ఉంది. అక్కడ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకోవడంతో సర్పంచి రహీమా బేగం హసేన వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. సొంత నిధులతో ఆ ప్రాంతంలో మూడు చోట్ల వేగ నియంత్రణలు ఏర్పాట చేశారు. దూరం నుంచి, చీకట్లో సైతం, వేగనిరోధకాలు కనిపించే విధంగా అవసరమైన పెయింట్లు వేయించారు. హెచ్చరిక సూచనలు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భీమడోలు సిఐ.విల్సన్‌తో పాటు ఎస్ఐ సుధాకర్ వేగనిరోధకాలకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గంజి సుబ్బారావు, పి.సత్యనారాయణ, నాగబాబు పాల్గొన్నారు.

మేడే విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి – చింతలపూడి

ఉద్యోగాల తొలగింపు, కాంట్రాక్టు కార్మిక వ్యవస్థకు నిరసనగా ప్రపంచ కార్మిక వర్గ పోరాట దినమైన 139వ మేడేను విజయవంతం చేయాలని ఏపి ఆర్‌సిఎస్ జిల్లా కార్యదర్శి భాస్కర్ కోరారు. మండలంలోని లింగగూడెం గ్రామంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయాలని, నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, భవన నిర్మాణ, అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మే 20వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆర్‌సిఎస్ డివిజన్ కార్యదర్శి బాబూరావు, జిల్లా కమిటీ సభ్యులు కొండా రాము, పిఒడబ్ల్యూ స్త్రీ విముక్తి మహిళా నాయకురాలు భూమక్క కుర్రాజులు, వెంకటేష్, రమేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి శంకుస్థాపనపై హర్షం

ప్రజాశక్తి – నూజివీడు

యనమందల గ్రామపంచాయతీ నుంచి రేగుంట మీదుగా బోరవంచ వరకు వేసిన తారు రోడ్డుకు సంబంధించి ఎన్ఎస్‌పి కెనాల్ వంతెనలు ఏర్పాటు చేయకపోవడంతో అటువైపుగా ప్రయాణిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి ఎన్ఎస్‌పి కెనాల్ వంతెనల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేయడంపై యనమందల, రేగుంట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న తరాలకు మంత్రి పార్థసారథి ఆదర్శంగా నిలుస్తారని జనసేన మండలాధ్యక్షులు యర్రంశెట్టి రాము, రేగుంట గ్రామ నాయకులు మోచర్ల ఎలీషారావు తెలిపారు.

'మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

ప్రజాశక్తి – కలిదిండి

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిన తాడినాడలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకిచ్చే జీవన భృతిని వారి ఖాతాలో జమచేసిన సందర్భంగా చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిడిమిల్లి శ్రీనివాసరావు, సంగాని రామకృష్ణ, నడకుదుటి వెంకటేశ్వరరావు, వాటాల దుర్గరాజు, కొల్లాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం పాట

ముసునూరు : మండలంలోని బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు కౌలు వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి అలివేణి శ్రీ నాగలక్ష్మి దేవి తెలిపారు. రూ.3.32 లక్షలకు ముగ్గురు రైతులు వ్యవసాయం చేసేందుకు పాట దక్కించుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ సారి రూ.1.10 లక్షలు అధిక ఆదాయం పొందినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి తెలిపారు. ఈ వేలం పాట కార్యక్రమంలో గ్రామస్తులు, కార్యనిర్వహణ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్లు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి – ముసునూరు

ప్రయివేట్ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒకటో తరగతిలో 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పించనున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 25 శాతం ఉచిత సీట్ల కోసం మే 15వ తేదీ లోపు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్హులైన అభ్యర్థులు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారనారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

చాట్రాయి : ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ లోపు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్హులైన అభ్యర్థులు ప్రయివేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని ఎంఇఒ వివిఎస్‌వి.బ్రహ్మచారి తెలిపారు. ఈ అవకాశాన్ని తమ పిల్లలను ఒకటో తరగతిలో చేర్చే తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు.

ఉగ్ర దాడికి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి – వేలేరుపాడు

కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం చాలా దుర్మార్గమని సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన కుటుంబాలకు తగిన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శ్రీను, బల్ల మల్లేశ్వరరావు, బొగారి వెంకటేశ్వర్లు, కమ్మసిచ్చు రమేష్, సూరి, పాంచేట, వాదం రమేష్, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో...


చింతలపూడిలో...

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో కూటమి నేతల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి :కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్ఎస్.రాజేంద్ర మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి దారుణమన్నారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం వ్యక్తం చేసి, వారి జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ మాట్లాడుతూ ఇది ఉగ్రవాదుల పిరికి పంద చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నకరరావు, రాఘవులు, నాగరాజు, దక్షిణామూర్తిపాల్గొన్నారు.

కొయ్యలగూడెం :పహల్గాంలో ఉగ్రదాడికి వ్యతిరేకంగా టిడిపి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్డ మేఘలాదేవి ఆధ్వర్యంలో కొవ్వుత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడారు. జాతీయ ఐక్యతను ప్రదర్శిస్తూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గళమెత్తారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ వెంకటరాజు

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ద్వారకాతిరుమల మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ పివివి.ప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ పద్మశ్రీ, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండలాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. ప్రజా ప్రతినిధులు పంచాయతీల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ అగ్రికల్చర్ రైతులు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని వారికి ముందస్తు వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని, దీంతో రైతులు నష్టపోకుండా చేయవచ్చని చెప్పారు. అగ్రికల్చర్ యంత్ర పరికరాలు అవసరమైన వారికి మాత్రమే ఇవ్వాలని సూచించారు. పొలాల్లోకి మట్టి అవసరమైన రైతులు విఆర్ఒ ద్వారా పర్మిషన్ తీసుకుని చెరువుల్లో మట్టి వినియోగించుకోవచ్చని తెలిపారు. రైతుల ద్వారా 4706 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, వారికి ఇప్పటి వరకు రూ.10.88 కోట్లు వారి ఖాతాకు జమ చేశామని అగ్రికల్చర్ అధికారి తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ మండలాభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సుబ్బరాయన్, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిపి బొండాడ మోహిని వెంకన్న బాబు, జెడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

పోలవరం ఎంఎల్ఎ బాలరాజును కోరిన కొండపల్లి రవి

ప్రజాశక్తి – టి.నరసాపురం

ఎర్ర చెరువు కాలనీ వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును కోరారు. ఈ మేరకు ఎంఎల్ఎను జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కొండపల్లి రవి మాట్లాడుతూ టి.నరసాపురం బస్టాండ్ ప్రాంతంలోని ఎర్రచెరువు కాలనీలో సుమారు 400 మంది నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వచ్చే వరదలకు కాలనీ ముంపునకు గురై ప్రజలు నిరాశ్రయులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్టగూడెం రోడ్డులో హై లెవల్ కల్వర్టు నిర్మాణం చేపట్టి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ఎంఎల్ఎ బాలరాజుతో రవి

జ్యోతిస్వరూప సేవలు అభినందనీయం

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

పశువులకు సంక్రమించే వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం చేసి మూగజీవుల ప్రాణాలు కాపాడుతున్న శనివారపుపేట పశు వైద్య అధికారిణి డాక్టర్ జ్యోతి స్వరూప సేవలు అభినందనీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎపిటిఎఫ్-1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ కృష్ణ అన్నారు. ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా శనివారపుపేటలోని పశు వైద్యశాలలో డాక్టర్ జ్యోతి స్వరూపను కృష్ణ దుశ్శాలువతో సన్మానించారు. డాక్టర్ జ్యోతి స్వరూప శనివారపుపేటలోని పశువైద్యశాలకు వచ్చినప్పటి నుంచి ఆ ప్రాంతంలో ఉండే మూగజీవాలకు నిత్యం సేవలందిస్తున్నారన్నారు. ఆమె మూగజీవాల పట్ల చూపిస్తున్న ప్రేమ, ఆదరణ ఆ ప్రాంత ప్రజలు మర్చిపోలేరన్నారు. పశువుల యజమానులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ అందరికీ అందుబాటులో ఉండి సేవ